చవితి సందడి

- గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా ముస్తాబు
- రేపటి నుంచి చవితి ఉత్సవాలు ప్రారంభం



కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 5: నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యాప్తంగా వినాయక చవితికి ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. వాడవాడలా విగ్రహాలు పెట్టేందుకు యువకులు పోటీపడుతున్నారు. చవితి పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. అన్ని పట్టణాల్లోని వీధుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. శనివారం జరిగే వినాయక చవితి వేడుకకు భక్తులు సిద్ధమయ్యారు. తొలిపూజతో 'గణేశ్ నవరాత్రి ఉత్సవాలు' అంగరంగ వైభవంగా ఆరంభం కాబోతున్నాయి. తొమ్మిది రోజుల పాటు ఈ మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు గణేశ్ భక్త ఉత్సవ కమిటీల ప్రతినిధులు సిద్ధమయ్యారు. వినాయక విగ్రహాలను మండపాలను తరలిస్తున్నారు. హైదరాబాదు తర్వాత రాష్ట్రంలో ఒక్క కర్నూలు జిల్లాలోనే గణేశ్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతాయి. ఈ ఏడాది కర్నూలు నగరంలో 2వేలకు పైగా విగ్రహాల వరకు వివిధ ప్రాంతాల్లో నెలకొల్పుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మరో వెయ్యి విగ్రహాల వరకు నెలకొల్పుతున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని జిల్లా పోలీసు అధికారులు సూచిస్తున్నారు. కాగా జిల్లా యంత్రాంగం కూడా ఉత్సవాల నిర్వహణకు పలు సూచనలు చేసింది.







వినాయక విగ్రహాలకు పెరిగిన గిరాకీ

ఏటా వినాయక చవితిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విగ్రహ తయారీదారులు గత మూడు నెలల నుంచే విగ్రహాలను తయారు చేయడం ప్రారంభించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మట్టి, జనప నార, కొబ్బరి పీచు, వివిధ రకాల రంగులతో వీటిని ఆకర్షణీయంగా రూపొందించారు. ఈ ఏడాది వినాయక విగ్రహాలకు గిరాకీ పెరిగింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మట్టి, ఇతరత్రా ముడిసరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా పెంచాల్సి వచ్చిందని వ్యాపారులు చెబుతున్నారు. మూడు అడుగుల నుంచీ పదిహేను అడుగుల వరకు విగ్రహాలను తయారీ చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.30 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ధరలు పలుకుతున్నాయి. గణేశ్ ఉత్సవ మండపాల నిర్వాహకులు ముందస్తుగా విగ్రహాలను ఎంపిక చేసుకోవాల్సి వస్తోంది.





వైసీపీకి యంత్రసేవ



- యంత్రాలన్నీ ఆనాటి అధికార పార్టీ నాయకులకే
- రూ.30 కోట్ల రాయితీ దుర్వినియోగం
- రూ.60 కోట్ల రుణం ఎలా వసూలు చేయాలో దిక్కుతోచని సహకార బ్యాంకు అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 5:

గత ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ యంత్ర సేవ పథకం ఆ పార్టీ సేవగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పథకం కింద పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం, యంత్ర పరికరాలు పక్కదారి పట్టడం తదితర ఫిర్యాదులు వస్తుండటంతో వెంటనే విచారణ జరిపించాలని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. థర్డ్ పార్టీ అధికారుల బృందాలు గ్రామాలకెళ్లి వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాల్లో జరిగిన అక్రమాలను వెలికి తీసే పని ప్రారంభించారు. దీంతో అప్పట్లో ఈ పథకంలో అక్రమాలకు పాల్పడిన అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆనాటి వైసీపీ నేతలకు తలొగ్గి కళ్లు మూసుకుని సంతకాలు పెట్టి, ఆ పార్టీ నాయకులకు, వారి అనుచరులకు లబ్ధి చేకూర్చిన వ్యవసాయాధికారులు ఈ వ్యవహారం తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వం 877 రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో రైతుభరోసా కేంద్రంలో నాలుగు నుంచి ఐదుగురు రైతులతో సంఘాన్ని ఏర్పాటు చేసి ఒక్కో సంఘానికి రూ.15 లక్షలు విలువ చేసే ట్రాక్టరుతో పాటు ఇతర పరికరాలను అందించే పథకానికి 2022లో నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో ఒక యూనిట్ విలువ రూ.15 లక్షలు కాగా, అందులో పది శాతం మొత్తాన్ని రైతులు భరించాలి. 50 శాతం మొత్తాన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందించింది. మిగిలిన 40 శాతం మొత్తాన్ని ప్రభుత్వం రాయితీగా అందించింది. కర్నూలు జిల్లాలో రూ.16.26 కోట్ల రాయితీని 466 యంత్ర సేవా పరికరాలకు అందించారు. ఈ పథకం ద్వారా 1,765 మంది రైతులు లబ్ధి పొందారని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. అదే విధంగా నంద్యాల జిల్లాలో 408 యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.15.74 కోట్ల రాయితీని ప్రభుత్వం అందించింది. 1,765 మంది లబ్ధి చేకూర్చినట్లు అధికారులు పేర్కొన్నారు. దాదాపు రూ.40 కోట్ల దాకా ఈ యంత్ర సేవా కేంద్రాలకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రుణం అందించింది. ఇంత పెద్ద మొత్తంలో దాదాపు రూ.32 కోట్ల రాయితీని ప్రభుత్వం అందించిన అర్హులైన రైతులకు ప్రస్తుతం ఏ మాత్రం యంత్ర సేవా పరికరాలు అందరికీ అందుబాటులో లేకపోవడం బాధాకరం. కర్నూలు జిల్లాలో 466 యంత్ర సేవా కేంద్రాలు, నంద్యాల జిల్లాలో 408 యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆ కేంద్రాలోని ట్రాక్టర్లు, ఇతర పరికరాలు వైసీపీ నాయకుల సిఫారసు ఉన్న వారికే వినియోగంలో ఉండిపోవడం దారుణం. అత్యవసరమైన పొలం పనులు చేసుకునే రైతులకు యంత్ర పరికరాలు క్రమ పద్ధతిలో ముందుగా అందించాల్సి ఉంది. అయితే.. నిబంధనలకు పాతర వేసి ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులు సిఫారసు చేసిన వారికే యంత్ర సేవా కేంద్రాలను ముందుగా కట్టబెట్టారు. దీంతో ఇతర రైతులు మరో దారి లేక పెద్ద మొత్తంలో అద్దెకు ట్రాక్టర్లను తీసుకోవాల్సి వచ్చింది.

ట్రాక్టర్లు, పరికరాలు వైసీపీ నేతల కల్లాల్లోనే

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా తమ అనుచరులు, తమ కుటుంబ సభ్యుల పేరుతో ఆ పార్టీ నేతలు రైతు సంఘాలను ఏర్పాటు చేసి పథకం ద్వారా ట్రాక్టర్లు, ఇతర పరికరాలను పొందారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఈ పథకం ద్వారా సంఘాలకు ఇచ్చిన ట్రాక్టర్లు, పరికరాలను రైతుభరోసా కేంద్రాల్లో పెట్టేందుకు వసతి కల్పించలేదు. ఎలాగూ సంఘాల్లో ఉన్న సభ్యులంతా తమ కుటుంబ సభ్యులు, అనుచరులే కావడంతో ఎవరూ నోరెత్తలేరనే ధీమాతో ఆ పార్టీ నాయకులు తమ కల్లాల్లో, ఇళ్ల వద్ద యంత్రాలు పెట్టుకున్నారు. తమ సిఫారసు వుంటేనే వీటిని రైతులకు అందించాలని రైతు కేంద్రాల్లోని సిబ్బందికి హుకుం జారీ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది గత ప్రభుత్వ హయాంలో అధికార నాయకులు, వారి అనుచరుల మాట జవదాటే అవకాశం ఉండేది కాదు.



వైసీపీ నేతల కల్లాల్లో ఉన్న ట్రాక్టరు

రైతన్నల విన్నపాలు చెత్తబుట్టలో

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో యంత్ర పరికరాలను, ట్రాక్టర్లను వ్యక్తిగతంగా అర్హతను బట్టి రైతులకు అందించేవారు. టార్పాలిన్లు, ఐవాన్స్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లు తదితర వాటిని 40 నుంచి 50 శాతం సబ్సిడీతో రైతులకు ఇచ్చేవారు. అదే విధంగా వ్యక్తిగతంగా వ్యవసాయ యంత్ర పరికరాలను అందించాలని గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు మొర పెట్టుకున్నారు. అయితే.. వారి మొర ఆలకించిన నాథుడే లేకపోవడం దురదృష్టకరం. సంఘాలకు యంత్ర పరికరాలను అందిస్తే తమకు పెద్ద ఎత్తున ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాల కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు అందుతాయనే ఉద్దేశంతోనే రైతు సంఘాలకు యంత్ర సేవా పథకాన్ని అమలు చేశారని రైతు సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు సతమతం

ఈ పథకానికి దాదాపు రూ.62 కోట్లను ప్రభుత్వం అన్ని జిల్లాల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రుణం అందించింది. కర్నూలు జిల్లాలో 466 యంత్ర సేవా కేంద్రాలకు, నంద్యాల జిల్లాలో 408 యంత్ర సేవా కేంద్రాలకు దాదాపు రూ.62 కోట్లను రుణంగా అందించింది. వీటిని దాదాపు రెండేళ్ల నుంచి వినియోగిస్తున్నా వాటి నుంచి నెల నెలా అందాల్సిన బకాయిలు సక్రమంగా అందకపోవడంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పథకాన్ని అమలు చేసింది మీరే కాబట్టి రైతు సేవా కేంద్రాల నుంచి బకాయిలను కూడా సక్రమంగా వసూలు చేసి జమ చేయాలని బ్యాంకు అధికారులు మండల వ్యవసాయాధికారులను అడుగుతున్నారు. అయినా వారు స్పందించడం లేదు. కొన్ని గ్రామాల్లో యంత్రాలను వినియోగించుకున్న రైతులు సక్రమంగా అద్దె కడుతున్నా కూడా వాటిని సంఘాల్లోని పెద్దలు బ్యాంకుకు చెల్లించకుండా స్వాహా చేస్తున్నారనే ఫిర్యాదులు సహకార కేంద్ర బ్యాంకు అధికారుల దృష్టికి వచ్చాయి.



విచారణకు ఆదేశాలు

వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.16 కోట్ల రాయితీ నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణకు ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు రూ.66 కోట్ల రుణాన్ని అందించినా సక్రమంగా రైతు సేవా కేంద్రాల నుంచి బకాయిలు వసూలు కాకపోవడంతో చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై యంత్ర పరికరాలు ఎక్కడ ఉన్నాయి?.. వాటిని వినియోగించుకున్న రైతులు అద్దె రూపంలో ఇప్పటి దాకా ఎంత మొత్తాన్ని చెల్లించారు?.. ఆ మొత్తాన్ని ఎవరెవరు పంచుకున్నారు?.. సహకార కేంద్ర బ్యాంకుకు ఎంత చెల్లించారు?.. తదితర అంశాలన్నింటిపైనా థర్డ్ పార్టీ అధికారుల కమిటీ విచారిస్తున్నట్లు తెలుస్తోంది.


ప్రభుత్వం విచారణకు ఆదేశించింది



గత ప్రభుత్వం అమలు చేసిన యంత్ర సేవా పథకంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గైడ్‌లైన్స్ వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం. అక్రమాలు జరిగి ఉంటే ఖచ్చితంగా సంబంధిత అధికారులు, ఇతరులపై చర్యలు తీసుకుంటాం.

\- వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ, కర్నూలు

నిధులన్నీ దుర్వినియోగమే



రైతుల ప్రయోజనం పేర గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ ప్రవేశ పెట్టిన యంత్ర సేవా పథకంలో చాలా అక్రమాలు జరిగాయి. యంత్రాలు అవసరమైన రైతులను లబ్ధిదారులుగా అనర్హులని ప్రకటించారు. ఈ పథకంలో వైసీపీ నాయకులతోపాటు అధికారులు కూడా అక్రమాలకు పాల్పడ్డారు. నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం అయ్యాయి.

\-జగన్నాథం, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

భావితరానికి బాటలు వేయండి

- విద్యార్థులకు ఉత్తమ విద్యను బోధించండి: మంత్రి ఫరూక్
- పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయండి: కలెక్టర్ రాజకుమారి


నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 5: పిల్లలను ఉన్నతమైన భావితరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాల్లో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యంగల ఉపాధ్యాయులు ఉన్నారని.... పిల్లలకు ఉత్తమ విద్యనందిస్తూ వారి భావితరానికి బాటలు వేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రం భారీ వర్షాలు, వరదల వల్ల క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, సేవా దృక్పథంతో బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని అన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యతను వెలికితీయాలని అన్నారు. అనంతరం 59 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మంత్రి, కలెక్టర్ ఘనంగా సన్మానించారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



డా.సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి, అధికారులు

తెరుచుకున్న శ్రీశైలం జలాశయం గేటు

కొనసాగుతున్న వరద ప్రవాహం



శ్రీశైలం, సెప్టెంబరు 5: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో డ్యాం అధికారులు మంగళవారం ఉదయం 11 సమయంలో జలాశయం క్రస్టుగేట్లను మూసివేశారు. గురువారం సాయంత్రం వరద ఉధృతి పెరగడంతో అధికారులు ఒక క్రస్టుగేటు ఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 78,366 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,916 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 117 క్యూసెక్కులు మొత్తం 96,399 వరద వస్తోంది. జలాశయం ఒక క్రస్టుగేటు ఎత్తి 27,937 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,22,062 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.80 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.88 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,708 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కులు, డ్యాం క్రస్టుగేటు ద్వారా 27,937 క్యూసెక్కులు మొత్తం 95,761 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

ఇసుక పాట్లు..!



ఇసుక బుకింగ్ చేస్తున్న సిబ్బంది

కర్నూలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇసుక కోసం భారీగా బారులు తీరారు. కర్నూలు నగరం రైల్వే స్టేషన్ సమీపంలో గనులు, భూగర్భ వనరుల శాఖ డీడీ కార్యాలయం ఆవరణలో ఇసుక బుకింగ్ కేంద్రం వద్ద గురువారం ట్రాక్టరు, టిప్పరు డ్రైవర్లు 'ఇసుక'పాట్లు అనుభవిస్తున్నారు. సి. బెళగల్ మండలం ఈర్లదిన్నె, కొత్తకోట, కె.సింగవరం గ్రామాల వద్ద తుంగభద్ర నదిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాల చేసే డీసిల్టేషన్ రీచులను ప్రారంభించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ పర్యవేక్షణలో ఇసుక తవ్వకాలు, రవాణా, సరఫరా చేస్తున్నారు. ఈ నెల 11వ తేది నుంచి ఆన్‌లైన్ బుకింగ్ మొదలవుతుంది. అప్పటి వరకు భవన నిర్మాణదారులకు ఇసుక కొరత తలెత్తకుండా కర్నూలు నగరంలోని మైనింగ్ డీడీ కార్యాలయం, సి.బెళగల్ తహసీల్దారు కార్యాలయం ఆవరణలో బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇసుక డిమాండ్ దృష్ట్యా ట్రాక్టరు, టిప్పరు డ్రైవర్లు తెల్లవారుజామున 4-5 గంటలకే మైనింగ్ ఆఫీసులోని బుకింగ్ కేంద్రానికి చేరుకుంటున్నారు. ఉదయం 9.30 గంటలు తరువాత బుకింగ్ సిబ్బంది వస్తారు. అంటే.. నాలుగైదు గంటలు ఇసుక కోసం వరుసలో నిరీక్షించాల్సి వస్తున్నది. ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం అయ్యేంతవరకు ఈ కష్టాలు తప్పవని అధికారులు అంటున్నారు.

- ఇసుక బుకింగ్ కోసం బారులు తీరిన ట్రాక్టర్, టిప్పర్ డ్రైవర్లు
- తెల్లారక ముందే మైనింగ్ కార్యాలయానికి..



రైల్వే స్టేషన్ సమీపంలోని మైనింగ్ డీడీ కార్యాలయం ఆవరణలో ఇసుక బుకింగ్ కోసం బారులు

శ్రీశైలంలో నకిలీ పోలీసు



స్వాధీనం చేసుకున్న డబ్బు, కారు, ఐడీకార్డు

శ్రీశైలం, సెప్టెంబరు 5: శ్రీశైలంలో పోలీస్ పేరుతో చెలామణీ అవుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన కుసుమ ప్రశాంత్ సైబరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పి ఈ నెల ఒకటో తేదీన శ్రీశైలం పోలీసులకు ప్రొటోకాల్ దర్శనం, వసతి సౌకర్యాలను కల్పించాలని కోరాడు. అయితే అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన సీఐ ప్రసాదరావు విచారణ చేపట్టారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్నట్లు నకిలీ ఐడీతో శ్రీశైలానికి వచ్చాడు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఘట్‌కేశ్వర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పంచాయితీ చేస్తానంటూ రూ.40వేలు ఫోన్ పే ద్వారా తన ఖాతాకు మళ్లించుకున్నాడు. కొందరు అధికారుల పేర్లు చెప్పి ఇలాంటి సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడిని అరెస్టు రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి రూ.1,020, కారును పోలీసులు సీజ్ చేశారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు



చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 5: కష్టాల్లో ఉన్న వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం సహాయ నిధికి సిగాచి ఇండస్ట్రీస్, సిండికేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ముచ్చువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ, ఆదోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కోఆపరేటివ్ బ్యాంకు వారు విరాళాలు అందజేశారని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు తరపున డీసీవో రామాంజనేయులు రూ.5 లక్షలు చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. సిగాచి ఇండస్ట్రీస్ ప్రాజెక్టు ఇంజనీర్ నలిని కాంత్ రాజు రూ.లక్ష చెక్కును అందజేశారు. అదేవిధంగా సిండికేట్ రిటైర్డ్ ఎంప్లాయాస్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధుల సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ రిజ్వాన బేగం, ప్రభాకర్ రూ.లక్ష చెక్కును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్, డీసీవో రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఘాట్‌ను పరిశీలించిన నగర పాలక కమిషనర్



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ పీవీ రామలింగేశ్వర్

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 5: నగరంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే కేసీ కెనాల్ వినాయక ఘాట్‌ను గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఘాట్ వద్ద మొదలైన పిచ్చిమొక్కల తొలగింపు, పరిశుభ్రత, పారిశుధ్యం పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిమజ్జనం రోజున నగర పాలక సంస్థ చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం 17, 18 వార్డులలో ఆయన విస్తృతంగా పర్యటించి, పలు సమస్యలపై చర్చించారు. ఆయన వెంట నగరపాలక ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, డీసీపీ సంధ్య, డీఈ నరేష్, ఏఈలు జనార్దన్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

పోలీసు వాహనాలకు నూతన టెక్నాలజీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 5: నంద్యాల జిల్లాలోని పోలీసు వాహనాలకు నూతన టెక్నాలజీతో కూడిన జీపీఎస్‌లను అమర్చినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. గురువారం ఏడు హైవే మొబైల్ వాహనాలకు, 22 బ్లూకోట్ వాహనాలకు జీపీఎస్‌లను అమర్చారు. జీపీఎస్ విధానం ద్వారా పోలీస్ సిబ్బంది ఏ ప్రదేశాల్లో తిరుగుతున్నారు, మునుపటి రోజుల్లో ఏయే ఏరియాల్లో తిరిగారన్నది కచ్చితంగా తెలుసుకునే వీలుందని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే ఏదైనా ఘటన జరిగితే ఆ స్థలానికి ఎవరు దగ్గరలో ఉన్నారన్నది కూడా ఈ జీపీఎస్ విధానం ద్వారా తెలుస్తుందన్నారు. తద్వారా సంఘటనా స్థలానికి దగ్గరలో ఉన్న సిబ్బందిని పంపే వీలుంటుందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతున్నారా? లేక ఒకేచోట విశ్రాంతి తీసుకుంటున్నారా? అన్న వివరాలు తెలుసుకుని అప్రమత్తం చేయడానికి ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. సిబ్బంది గస్తీ తిరగడంలో నిర్లక్ష్యం, అప్రమత్తంగా ఉన్నారో లేదో తెలిసిపోతుందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నంద్యాల జిల్లాలో బ్లూకోట్ వాహనాలకు జీపీఎస్ అమర్చి నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నామని ఎస్పీ వెల్లడించారు. అలాగే హైవే మొబైల్ వాహనాల డ్రైవర్లకు, బ్లూ కోట్ వాహనాల డ్రైవర్లతో ప్రత్యేకంగా సమావేశం జరిపి నేరాల నియంత్రణలో ముఖ్య పాత్ర పోషించిన వారికి రివార్డులు, అలసత్వం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా స్పష్టం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కోసిగి, సెప్టెంబరు 5: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోసిగి మండలంలోని చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన గొల్ల నారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన నారాయణ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు సంతానం.

సొంతానికి 130 మీటర్ల డ్రైనేజీ

- రూ. 5 లక్షల పంచాయతీ నిధులు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి
- అనుమతి తీసుకోలేదంటున్న అధికారులు



పంచాయతీ నిధులతో సర్పంచు ఇంటికి వేసుకొన్న డ్రైనేజీ కాల్వ

ఆదోని రూరల్ సెప్టెంబరు 5 : ఆదోని మండలం కుప్పగల్ గ్రామ సర్పంచు నాగిరెడ్డి వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి పంచాయతీ నిధులతో 130 మీటర్ల డ్రైనేజీ కాలవు నిర్మించుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి నాగిరెడ్డి నోట్లో నాలుకలా ఉండేవాడు. సర్పంచు ఎన్నికల్లో వైసీపీ మద్దతుతో గెలిచాడు. వైసీపీ ప్రభుత్వం ఉన్నన్నాళ్లు ఆయన ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి కొట్లాటతో ఆదోని మండలంలో టీడీపీ నాయకుల మాట చెల్లడం లేదని గుర్తించిన సదరు సర్పంచు నాగిరెడ్డి ఆఘమేఘాలపై బీజేపి ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో ఆ పార్టీలో చేరాడు.

సొంత ఇంటి డ్రైనేజీ నిర్మాణానికి...

సర్పంచు నాగిరెడ్డి అధికారులపై ఒత్తిడి తెచ్చి గ్రామంలో తన ఇంటికి ఏకంగా 130 మీటర్లు డ్రైనేజీ కాల్వను కట్టించుకున్నాడు. ఆ డ్రైనేజీ పరిసర ప్రాంతంలో ఆయన ఇల్లు మాత్రమే ఉంది. తన ఇంటి కోసం ఈ 130 మీటర్ల డ్రైనేజీ కాల్వకు రూ.5లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. కాల్వ పూర్తయిన తరువాత పంచాయతీ నిధుల కింద రూ.5లక్షలు బిల్లులు మంజూరు చేయాలని ఎంబుక్ తయారు చేసి అధికారుల ముందు విసిరేశాడు.

మా అనుమతి తీసుకోలేదు...

కుప్పగల్లు గ్రామ సర్పంచు తన ఇంటికి డ్రైనేజీ కాలువ నిర్మించుకున్నాడు. ఆ కాల్వకు ఇరువైపులా గరుసు కూడ వేయలేదు. నాసిరకంగా నిర్మించాడు. పని ప్రారంభించకముందు ఎస్టిమేషన్ ఇవ్వాలి. సర్పంచు మాత్రం పని పూర్తి చేసి ఎస్టిమేషన్ ఇచ్చాడు. రూ.5లక్షలతో నిర్మించానన్న కాల్వను పరిశీలించాను. సర్పంచు ఇల్లు తప్ప అక్కడ ఎవరూ నివాసం ఉండడం లేదు. మా అనుమతి తీసుకోలేదు కాబట్టి బిల్లు మంజూరు చేయకుండా ఆపాను.

-రాణి, పంచాయతీ రాజ్ డిఈ

వార్షిక రుణ ప్రణాళికలో రూ.12,828 కోట్లు

- పంట రుణాలకు రూ.5,366 కోట్లు లక్ష్యం
- బ్యాంకర్ల సమావేశంలో మంత్రి ఫరూక్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 5: నంద్యాల జిల్లాలో 2024 సంవత్సరంలో 25వ వార్షిక రుణాల ప్రణాళిక కింద వివిధ బ్యాంకుల ద్వారా రూ.12,828 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన బ్యాంకర్ల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రధానంగా వ్యవసాయ రంగానికి రూ.5,366 కోట్లు, టర్మ్‌లోన్లకు రూ.2,503 కోట్లు, చిన్న, మధ్యతర పరిశ్రమలకు రూ.1,400 కోట్లు, గృహనిర్మాణాలకు రూ.567 కోట్లు, ప్రాధాన్యత రంగాలకు రూ.394 కోట్లు ఇతర ప్రాధాన్యత రంగాలకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు బ్యాంకర్లు సహకరించాలని మంత్రి కోరారు. అలాగే టిడ్కో కింద లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించామని మరింత చేయూతనిచ్చి రుణాల మంజూరుకు సహకరించాలని బ్యాంకర్లను సూచించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులకు రుణాల కింద రూ.130 కోట్లు మంజూరు చేశారని దాదాపు 30 వేల మంది కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ కింద సాగు చేసుకుంటున్న రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి ముద్ర రుణాలను నిరుపేదలకు విరివిగా ఇవ్వాలన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు రుణాల రీషెడ్యూల్ చేస్తూకొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రుణాల పేరిట దగా

- రూ. లక్షల్లో వసూలు చేసిన మహిళకు దేహశుద్ధి
- మరో ఇద్దరికి కోసం గాలిస్తున్న పోలీసులు

ఆలూరు, సెప్టెంబరు 5 : ఆలూరుకు చెందిన ఈరమ్మ అనే మహిళస్పాట్ రుణాల పేరుతో రూ. లక్షల్లో వసూలు చేసి చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో గురువారం పట్టణంలోని కోయనగర్‌కు చెందిన మహిళలు జంగాలి ఈరమ్మను నిర్బంధించి దేహశుద్ధి చేశారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ నిలదీశారు. ఇందులో ముద్దన గేరికి చెందిన మైకేల్, హాలేబీడుకు చెందిన చాకలి బసవరాజు పాత్ర కూడా ఉన్నట్లు వెల్లడైంది. ఈ ముగ్గురు కలసి కొంత మంది నుంచి బంగారు కూడా తీసుకొని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ బ్యాంక్ నుంచి రుణాలు పొందినట్లు మహిళలు పోలీసులకు వివరించారు. తమ డబ్బుతో ప్లాట్లు కూడా కొనుగోలు చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకట నరసింహులు ఆ మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తమ డబ్బు తమకు ఇప్పించాలని మహిళలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కర్నూలు, సెప్టెంబరు 5: మూడో పట్టణ పోలీస్‌స్టేసన్ పరిధిలో లక్ష్మీనగర్‌లో విద్యుదాఘాతానికి గురై మహ్మద్ షరీఫ్ (41) అనే వ్యక్తి మృతి చెందాడు. షరీఫ్ స్థానిక లక్ష్మీనగర్‌లో మోటారు సైకిళ్లకు సీటు కవర్లు కుట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఈయన దుకాణం పక్కనే రవి కలెక్షన్స్ అనే దుకాణం ఉంది. ఆ షాపు చెందిన ఇనుపబోర్డును సెకండ్ ఫ్లోర్‌లో పెట్టేందుకు మహ్మద్ షరీఫ్ సాయం కోరారు. కింద బోర్డును పైకి లాగే క్రమంలో ప్రమాదవశాత్తు బోర్డుకు సంబంధించిన ఇనుప కడ్డీలు కరెంటు తీగలకు తగిలాయి. ఈ ప్రమాదంలో మహ్మద్ షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

మట్కాబీటర్ల అరెస్టు

కర్నూలు, సెప్టెంబరు 5: మూడో పట్టణ పోలీస్‌స్టేసన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు షేక్ సర్దార్ బాషా, హుశేన్‌బాషా, షేక్షావలి, షబ్బీర్ అహ్మద్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.50 వేల నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా దేవనగర్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసినట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

శిరివెళ్ల, సెప్టెంబరు 5: శిరివెళ్లలోని ఎస్సీ కాలనీకి చెందిన సుధాకర్ (54) అలియాస్ గంగన్న అనే రైతు ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. సుధాకర్ గత నాలుగేళ్లుగా కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వివిధ పంటలు సాగు చేసి, దిగుబడులు రాక అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం తెలియక మనోవేదనకు గురై ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య గురువారం తెలిపారు. తెలిపారు. మృతుడి భార్య విశ్వాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

విజిలెన్స్ ఎస్పీగా చౌడేశ్వరి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి

కర్నూలు, సెప్టెంబరు 5: విజిలెన్స్ ఎస్పీగా చౌడేశ్వరి గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో అనంతపురం అడిషనల్ ఎస్పీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా పని చేశారు. బాధ్యతలు తీసుకున్న ఆమెకు విజిలెన్స్ కార్యాలయ సిబ్బంది ఆమెకు ఘనస్వాగతం పలికారు.

కర్నూల్లో అత్యాధునిక క్రీడా సౌకర్యాలు కల్పించండి



కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 5: కర్నూల్లో అత్యాధునిక క్రీడా సౌకర్యాలు కల్పించాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. గురువారం సాయంత్రం ఢిల్లీ పర్యటన లో కేంద్ర క్రీడా శాఖా మంత్రి మున్సుఖ్ మాండ వీయాను ఆయన నివాసంలో కలిసి కోరారు. నగరంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు గల క్రీడా ప్రాంగణాన్ని నిర్మించాలని కోరారు. దీంతో పాటు అత్యుత్తమమైన కోచ్‌లను నియమించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి రాజధాని అయిన కర్నూల్లో క్రీడల అభివృద్ధి అన్ని రకాల అవకాశం ఉందన్నారు. కర్నూలు నుండి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నట్లు వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తే దేశానికి ఎన్నో పతకాలు తీసుకొస్తారని తెలిపారు.

ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ



ఆర్డీఎస్ ఆనకట్టపై పారుతున్న వరద నీరు

కోసిగి, సెప్టెంబరు 5: మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ (రాజోలి బండ డైవర్షన్ స్కీం) ఆనకట్ట వద్ద జలకళ సంతరించుకుంది. టీబీ డ్యాం నుంచి 50వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో దిగువన గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఆర్డీఎస్ ఆనకట్టకు పోటెత్తింది. దీంతో నదీతీర గ్రామాల్లోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఎస్‌కు వరద రావడంతో రైతులు వరినారు వేయడంలో బిజీ అయ్యారు. తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చిత్తూరు జిల్లా పశువైద్యశాఖ జేడీ ప్రభాకర్



చాగలమర్రి పశువైద్యశాలను పరిశీలిస్తున్న జేడీ ప్రభాకర్

చాగలమర్రి, సెప్టెంబరు 5: గ్రామాల్లో పశువైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు జిల్లా పశువైద్యశాఖ జేడీ ఎన్.ప్రభాకర్ తెలిపారు. గురువారం సాయంత్రం చాగలమర్రి పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. దెబ్బతిన్న పశువైద్యశాలను పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవన మరమ్మతులకు ప్రతిపాదిస్తామని అన్నారు. నంద్యాల జిల్లా జేడీ, పశువైద్య సిబ్బంది, అధికారుల మధ్య సమన్వయ లోపం ఉండటంతో విచారణ చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆళ్లగడ్డ, చాగలమర్రి పశువైద్యశాలలు, రెండు ఉప కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించామన్నారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. పశుబీమాపై అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధిహామీ ద్వార మినీ గోకులాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జేడీ వెంట ఏడీలు వరప్రసాద్, చంద్రశేఖర్, వైద్యాధికారులు సాయిబాబా, రవీంద్రారెడ్డి, దీపకుమారి తదితరులు ఉన్నారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



గోనె సంచులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, సెప్టెంబరు 5: తుఫాను వల్ల పంట నష్టపోయిన అన్నదాతలకు అండగా ఉంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆమె నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ఎమ్మెల్యే గౌరు చరిత బిలకలగూడురు గ్రామంలో గోనె సంచులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారన్నారు. వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తప్పనిసరిగా న్యాయం చేస్తుందని అన్నారు. విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. అయితే వైసీపీ నాయకులు ఓర్వలేక నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బాధితులకు భరోసాగా ఉండక పోగా విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. వర్షం వల్ల దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయిస్తామన్నారు. కూలిన మట్టిమిద్దెలకు పక్కా ఇళ్లు మంజూరు చేయిస్తామని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్ఏరఫిక్, సుదర్శన్‌రెడ్డి, పంట రామచంద్రారెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, తహసీల్దార్ విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'



టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరురూరల్, సెప్టెంబరు 5: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో శివాందరెడ్డి, జయసూర్య సమక్షంలో పగిడ్యా మండలం లక్ష్మాపురం గ్రామ వైసీపీ నాయకులు టీడీపీ నాయకులు మద్దిలేటి, పుష్పరాజ్, స్వాములు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. లోకన్న ఆనంద్, రాజు, సత్తి, విజయుడు, దర్గయ్యతో పాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

● పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ మోహన్, నాయకులు శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో టీడీపీ నాయకులు మందడి వెంకటరామిరెడ్డి, శ్రీనాథరెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. నాయకులు సుధాకర్, శ్రీరంగడు, సురేష్, గోవిందు, వెంకటేష్ గౌడు, అశోక్ కుమార్, నాగమల్లితో పాటు 90 కుటుంబాలు టీడీపీలో చేరాయి.


పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 5: నంద్యాల జిల్లా కేంద్రంలోని పలు పోలీస్ స్టేషన్లను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బుధవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నంద్యాల వన్ టౌన్, త్రీ టౌన్, నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్లను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్లలోని రికార్డులను అయన పరిశీలించారు. అలాగే పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు నైట్ బీట్ సిస్టంను రివ్యూ చేసుకోవాలని ఆదేశించారు. క్రైం ప్రోన్ ఏరియాలపై ఆయా స్టేషన్ల అధికారులతో ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆక్టివ్‌గా ఉండే రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. రాబోయే గణేష్ నిమజ్జనానికి సంబంధించిన కమ్యూనల్ సెన్సిటివ్, పొలిటికల్ సెన్సిటివ్ ఏరియాలపై పోలీస్ అధికారులతో చర్చించారు. నిమజ్జనానికి సంబంధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించి వాహనాలకు సంబంధించిన రికార్డులు, పత్రాలను పరిశీలించారు.

తలనీలాల వేలం

పాణ్యం, సెప్టెంబరు 5: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తలనీటాల వేలంలో రూ. 42.25 లక్షల ఆదాయం చేకూరినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. గురువారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటల్లో కడప జిల్లా మైదుకూరుకు చెందిన జె. మంగమ్మ ఈ టెండరు వేలంలో పాట దక్కించుకున్నట్లు తెలిపారు. బహిరంగ వేలం పాటలో ఏడు మంది పాటదారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ టెండరులో రెండు టెండర్లు వచ్చాయన్నారు. గత ఏడాది రూ. 36,25,500ల ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 6,00,500 ఆదాయం అదనంగా చేకూరినట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటేశ్

కొత్తపల్లి, సెప్టెంబరు 5: కొత్తపల్లి భ్రమరాంబ చెంచుగూడెం చెందిన కుదుముల వెంకటేశ్ (35) కనపడడం లేదని ఆయన భార్య రాములమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కేశవ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 1 సాయంత్రం 4 గంటల నుంచి కుదుముల వెంకటేశ్ కనపడడం లేదని భార్య రాములమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా కనిపిస్తే కొత్తపల్లి ఎస్ఐ 9121101185 నెంబరుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

వెలుగోడు, సెప్టెంబరు 5: మండలంలోని క్రిష్ణానగర్ గ్రామంలో టీడీపీ నాయకుడు జడల్‌నాయక్ (60) మృతి చెందారు. గురువారం నందికొట్కూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య జడల్ నాయక్ మృతదేహానికి మండల టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు, లక్ష్మీకాంతరెడ్డి, గోవిందు, మధుకృష్ణ నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

పాములపాడు, సెప్టెంబరు 5: ఇటీవల తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు తిమ్మారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా మొక్కజొన్న, మినుము, సోయాబీన్స్, మిరప వేల హెక్టార్లలో పంటలు మునిగి పోయాయని, దీంతో పంటలకు వివిధ రకాల తెగుళ్ళు సోకడంతో ఉన్నవి కాస్తా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ అధికారులు దెబ్బతిన్న పంటపొలాలను సందర్శించి, పంట వివరాలను సేకరించి నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపి పరిహారం అందేల చూడాలని ఆయన అధికారులను కోరారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

● సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి
● ఉపాధ్యాయులకు సన్మానం



గోస్పాడు: ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్



నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న శాస్త్రవేత్తలు



మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

నంద్యాల టౌన్, సెప్టెంబరు 5: నంద్యాలలోని ఆర్ఏఆర్ఎస్‌లో ఏడీఆర్ డాక్టర్ ఎం.జాన్సన్ అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోస్పాడు: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని గురువారం న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి సన్మానించారు. మండలం నుంచి జిల్లెల్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని శైలజ, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శివనాగేంద్రుడు, గోస్పాడు మోడల్ స్కూల్ పీఈటీ ఉదయ్‌కుమార్, దీబగుంట్ల జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథ్, గోస్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరల్ నందకుమార్‌బాబులు ఎంపికయ్యారు. వీరిని మంత్రి, కలెక్టర్ సన్మానించారు. ఎంఈవోలు అబ్దుల్ కరీం, సురేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో నందికొట్కూరు ఎంఈవో సుభాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మండలంలో 24 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. గోకవరంలోని భక్తకన్నప్ప గురుకులం చెంచు విద్యార్థుల ఆవాసా కేంద్రంలో కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. మాండ్ర మాట్లాడుతూ గోకవరం గ్రామానికి చెందిన పుల్లారెడ్డి చెంచు విద్యార్థుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. విశ్రాంత డిప్యూటీ డీఈవో సుమతి, రిటైర్డు ఎంఈవో నాగేశ్వరరావు, రిటైర్డు హెచ్ఎం శివశంకర్ రెడ్డి, రిటైర్డు తెలుగు పండిట్ కమటం శంకర్‌కు మెమెంటో అందజేసి శాలువలతో సన్మానించారు. గురుకుల ఆవాసాకు చెందిన రఘురామయ్య, గుర్రప్ప, పాఠశాల నిర్వాహకులు వాసుదేవరెడ్డి, రామకృష్ణ, నాయకులు నారపరెడ్డి, శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలంలోని వివిద గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల యందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మిడుతూరు జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం సాయితిమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్రాంత హెచ్ఎం వెంకటసుబ్బయ్యను ఉపాధ్యాయులు సన్మానించారు. శ్రీనివాసమూర్తి, నాగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీనవనంది పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పూలమాలవేసి నివాళి అర్పించారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణ చిత్రపటం వద్ద బీజేపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ మోమిన్ షబానా, కళాశాల ప్రిన్సిపాల్ నాగ జిష్ణు విజయ్ నివాళి అర్పించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, రహమత్ నగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులను ఎంఈవో బాలాజీనాయక్ సత్కరించారు.

గడివేముల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో విమలా వసుంధారాదేవి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఎంఈవో సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పాణ్యం: మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని, వైస్ ప్రిన్సిపాల్ పుల్లయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారయణ తదితరలు పాల్గొన్నారు.



వెలుగోడులో..



కొత్తపల్లి: రిటైర్డు డిప్యూటీ డీఈవో సుమతిని సన్మానిస్తున్న మాండ్ర శివానందరెడ్డి



గడివేములలో..



ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



నందికొట్కూరు రూరల్: నందికొట్కూరులోని మండల విద్యాశాఖ కార్యాలయంలో..

వ్యవసాయ ఉపకరణాల పంపిణీ

మిడుతూరు, సెప్టెంబరు 5: మిడుతూరులోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గురువారం ఐసీఏఆర్ జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ ఎస్సీ సబ్ ప్లాన్ పథకం కింద వ్యవసాయ ఉపకరణాలను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఎస్సీ రైతులకు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, సర్పంచ్ జయలక్ష్మి హాజరయ్యారు. పవర్ స్ప్రేర్, నీమ పవర్ పౌడర్, భూమ్ పవర్ పౌడర్, టార్చి లైట్, టార్పాలిన్ కవర్ల కిట్లను వ్యవసాయ కిట్లను అందించారు. నాకో సంస్థ చైర్మన్ బాలకృష్ణ, శాస్త్రవేత్త రమేష్ నాయక్, ఏడీఏ విజయశేఖర్, వ్యవసాయ అధికారి పీరునాయక్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు రఘురామయ్య, కాతా విష్ణువర్ధన్ రెడ్డి, రవీంద్ర బాబు, మనోహర్‌రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, రామస్వామిరెడ్డి, నరసింహగౌడు, షబ్బీ బాషా పాల్గొన్నారు.

'ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 5: రానున్న వినాయక చవితి ఉత్సవాన్ని పట్టణ ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో ఎం.దాసు, డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. పట్టణంలోని ఎంఅండ్ఎం ఫంక్షన్ హాల్‌లో గురువారం వివిధ మతాల పెద్దలతో పాటు అన్ని గణేష్ మంటపాల నిర్వాహకులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలందరూ ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా జరిగే వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి మంటపానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక, ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు ఓబులేసు, సురేష్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

వెలుగోడు: ప్రతి ఒక్కరూ తమ పండుగలను కలసి మెలసి ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. వెలుగోడు పట్టణంలోని సాయిబాబ ఆలయం మందిరంలో శాంతియుత కమిటీ, ఉత్సవ నిర్వాహకులతో అయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక చర్యలకు పాలడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ విష్ణు నారాయణ, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, సర్పంచ్ జయపాల్, డాక్టర్ వంకర్‌రెడ్డి, ఎల్లాల కృష్ణుడు, హిదాయత్, ఖలీల్, తిరుపాల్‌నాయక్, నాగేశ్వరరావు, నారయణరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

విత్తనాల అమ్మకం నిలుపుదల

నంద్యాల టౌన్/రూరల్, సెప్టెంబరు 5: నంద్యాలలో సరైన ధ్రువ పత్రాలు లేని కారణంగా రూ.6.98 లక్షల విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలిపివేసినట్లు ఏవో ప్రసాదరావు వెల్లడించారు. గురువారం జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆదేశాల మేరకు విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్, విత్తన దుకాణాలను ఏవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో నరేంద్ర హైబ్రీడ్ సీడ్స్‌లో రిజిస్టర్, బిల్ బుక్కులు, ఇతర ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో అమ్మకాలను నిలుపుదల చేశామని తెలిపారు.

'వందశాతం పంట నమోదు చేయించాలి'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 5: పంటలు సాగు చేస్తున్న ప్రతిరైతుకు వీఏఏలు పంటనమోదు చేయించాలని నంద్యాల మండల వ్యవసాయఅధికారి ప్రసాదరావ్ పేర్కొన్నారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల రైతుసేవా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఏఈవోలు ముక్తార్‌బాషా, రవికుమార్,విఏఏలు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అంతర్గత రోడ్లపై వర్షపు నీటిని తొలగించాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 5: పట్టణంలోని ఆయా కాలనీల్లోని అంతర్గత రోడ్లపై నిలిచిన వర్షపునీటిని తొలగించేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, స్వాములు, స్థానికులు కోరారు. గురువారం పట్టణంలోని లక్ష్మీనగర్ ఏరియాలో రోడ్డుపై నిలిచిన వర్షపునీటిలో చేపలు పడుతూ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలోని అనేక కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు.

'సమాజానికి సాంకేతిక పరిజ్ఞానం అందించాలి'

పాణ్యం, సెప్టెంబరు 5: విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి అందించాలని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం ఆర్జీఎం కళాశాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమా జానికి ఎలా ఉపయోగించుకోవాలి అన్న అంశంపై స్మార్ట్ హ్యాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచంలో సాంకతిక అవసరం వాటిని సమాజానికి అన్వయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. కళాశాలలోని ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 73 బృందాలు, 450 మంది విద్యార్థుల పాల్గొన్నారు. విద్యార్థులు వారి ఆలోచనలను కార్యరూపం చేసి జ్యూరీ సభ్యుల ముందు విషయ ప్రదర్శన చేశారు. విద్యార్థుల్లో 35 బృందాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ గోపీకృష్ణారావు, శాంతల ప్రియదర్శిని, పాల్గొన్నారు.

ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పిస్తాం: మంత్రి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 5: ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు సమకూరుస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ బైరెడ్డి శబరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ వరప్రసాద్, వైద్యశాలలోని వివిధ విభాగాల అధిపతులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గతంలో ఉన్న పెండింగ్ బిల్లులకు సంబంధించిన నిధులను ఆమోదించామన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఆసుపత్రిలో నీటికొరత లేకుండా మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ సేవలకు సంబంధించిన అవసరమైన అత్యవసర పరికరాలను ఎంపీ నిధుల నుండి ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, వివిధ విభాగాల అధిపతులు తదితరలు పాల్గొన్నారు.

'మెరుగైన వైద్య సేవలు అందించాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 5: గ్రామాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ సునీత సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఆయా కేంద్రాల సీహెచ్‌ఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లడారు. సీహెచ్‌ఓలు ఆయా గ్రామాల్లో నీటి నాణ్యతా పరీక్షలు, అంటువ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నజీనిన్, రాష్ట్ర కన్సల్టెంట్ శివవంకర్, కంటి వైద్యులు షేక్షావలి, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

'పంటనష్టాన్ని పకడ్బందీగా నమోదు చేయాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 5: ఆత్మకూరు మండలంలో ఇటీవల సంభవించిన అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఏడీఏ ఆంజనేయులు, తహసీల్దార్ రత్నరాధిక, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పంట నష్టం నమోదుపై అవగాహన కల్పించారు.

'పారిశుధ్య పనులు చేపట్టాలి'

నందికొట్కూరు, సెప్టెంబరు 5: పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమినర్ బేబీకి వినతిపత్రం పత్రం సమర్పించారు. అనంతరం ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలో రోజురోజుకు పేరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పట్టణంలో 29 వార్డుల్లో 60 వేలకు పైగా జనాభా ఉన్నారని ఆయా వార్డుల్లో డ్రైనేజీ కాలువలు సరిగా లేక నీరు నిలబడి దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. రైతు సంఘం నాయకులు సోమన్న, శ్రీరాములు, మాభాష, మహిళా రైతు నయకురాలు బేబీ తదితరులు పాల్గొన్నారు.

హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి: ఎంపీ



కుందూనది ప్రవాహ తీవ్రతను పరిశీలిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

గోస్పాడు, సెప్టెంబరు 5: తేళ్ళపూరి - రాయపాడు గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ బ్రిడ్జి స్థానంలో హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించేందుకు కృషి చేస్తామని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. కుందూనది ప్రవాహ తీవ్రతను గురువారం పరిశీలించారు. తీవ్రత ఎక్కువగా ఉందని, సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కుందూనది పక్కన ఉన్న పంట పొలాల్లోని పంటలకు నష్టం జరిగిందా? లేదా? అని వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ షేక్ మోహిద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ విజయశేఖర్, వ్యవసాయాధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన



బలపనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పాణ్యం, సెప్టెంబరు 5: ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపరాదని, అలాగే ఎయిడ్స్ నిర్మూలపై ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు జోనల్ సూపర్‌వైజర్ మీరంరెడ్డి అవగాహన కల్పించారు. గురువారం బలపనూరులో ఎయిడ్స్ నియంత్రణ మండలి పీడీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నివారణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి గురికాకుండా నివారణ చర్యల ద్వారా నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోషమ్మ, సురేష్‌బాబు, నాగేశ్వరమ్మ, ప్రభావతమ్మ, తులసి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు

● చెరువు తూము షెట్టర్ కొట్టుకుపోవడంతో నీరు వృథా
● ఆందోళనలో రైతులు



మల్లెలమ్మ చెరువు తూము నుంచి వృథాగా పారుతున్న నీరు



పంట పొలాల్లో నిలిచిన నీరు

కొత్తపల్లి, సెప్టెంబరు 5: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు లింగాపురం గ్రామ శివారులో ఉన్న మల్లెలమ్మ చెరువు తూము షెట్టర్ తుప్పు పట్టి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో చెరువులో నీరు పంట పొలాలపై వెళ్లడంతో పొలాలన్నీ నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుకు అనుసంధానంగా ఉండి సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందించే చెరువు తూము షెట్టర్ తుప్పు పట్టి భారీ వర్షాలకు పూర్తిగా ఊడిపోయి నీటిలో కొట్టుకుపోయింది. ఇప్పటికే రైతులు తూముకు అడ్డుగా ఇసుక బస్తాలు వేసినప్పటికీ చెరువులో నీరు అధికంగా ఉండటంతో నీరు పంట పొలాలను నీట ముంచి వృథాగా కిందకు పోతోంది. ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి తూముకు కొత్త షెట్టర్ ఏర్పాటు చేసి చెరువు నీరు వృథాగా వెళ్లకుండా అరికట్టాలని లింగాపురం గ్రామ రైతులు పోచా హుశేన్ రెడ్డి, పోచా రమణారెడ్డిలు కోరారు. ఈ విషయంపై మండల మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్ రెడ్డిని వివరణ కోరగా.. ఇప్పుడే తమకు తెలిసిందని, తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లి వృథాగా పారుతున్న చెరువు తూముకు షెట్టర్ ఏర్పాటు చేసి వృథాగా పారుతున్న నీరును అరికట్టి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

డోన్(రూరల్), సెప్టెంబరు 5: పట్టణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డోన్ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రిటైర్డు ఉపాధ్యాయుడు శతావధాని దత్తాత్రేయ శర్మ, సుబ్బరాయుడు, జయరాముడులను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్ పాల్గొన్నారు.

● పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో రిటైర్డ్ గ్రంథాలయ అధికారి పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులరించారు. అనంతరం ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు పించన్లు పంపిణీ చేశారు. మాయలూరులో హెచ్‌ఎం షరీఫ్‌ను శాలువా, పూల మాలలతో పల్లె నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.

బనగానపల్లె: గురువును మించిన శిష్యులుగా విద్యార్థులు ఎదగాలని ఉమ్మడి జిల్లాల టెలికాం మాజీ అడ్వైజర్ మెంబర్, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. గురువారం బనగా నపల్లె పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. నియోజకవర్గంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను అందించి సన్మానించారు.

● బనగానపల్లె పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ రామలక్ష్మి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బేతంచెర్ల: మండలంలోని ముద్దవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్, వాసవి క్లబ్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు తిమ్మప్పను సన్మానించారు. అమ్మవారిశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్యాపిలి: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజామల: సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంఆర్‌సీ కానాల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి ఎంఈవోలు ఈశ్వరయ్య, రాజయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్రంలో రిటైర్డ్ తెలుగు ఉపాధ్యా యుడు చెన్నకేశవ శాస్త్రిని సత్కరించారు. కార్యక్రమంలో హెచ్.ఎంలు అరుణ కుమారి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి గురువారం నివాళి అర్పించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు రమణ, ఓబులేసు, దేవేంద్ర పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్‌ఎంలు, సీనియర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రవరం: విద్యాదానం మహాదానమని విశ్రాంత ఎంఈవో హుసేన్ అన్నారు. రుద్రవరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. రుద్రవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్బరాయుడును ఉపాధ్యాయులను సన్మానించారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. క్రిష్టిపాడు ఎంపీయూపీ స్కూల్, భాగ్యనగరం జడ్పీహెచ్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులను శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ వలి, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకుడు బాషా, ఎంపీటీసీ మాబు సుభాన్ పాల్గొన్నారు.


కోవెలకుంట్లలో..



చాగలమర్రిలో..


డోన్‌లో రిటైర్డు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు


బనగానపల్లెలో ఉత్తమ ఉపాధ్యాయులతో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి


బేతంచెర్లలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు


క్రిష్టిపాడులో హెచ్‌ఎంలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



రుద్రవరంలో విశ్రాంత ఎంఈవోను సన్మానిస్తున్న హెచ్‌ఎం

ఉత్సవమూర్తులకు అభిషేకం


ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 5: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవికి వేదపండితులు నవకలశ పంచామృతాభిషేకం నిర్వహించారు. మొదటి, 44వ పీఠాధిపతి జయంతి పురస్కరించుకొని అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

డోన్(రూరల్), సెప్టెంబరు 5: డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 10న నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాకు పదో తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు.

'మాతా శిశు మరణాలు తగ్గించాలి'

బనగానపల్లె, సెప్టెంబరు 5: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మాతా శిశు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి కృషి చేయాలని సీడీపీవో ఉమామహేశ్వరి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో మతా శిశు మరణాల అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకరుడు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పంట నమోదు తప్పనిసరి'

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 5: రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఉద్యానవనశాఖాధికారి ధరణి సూచించారు. గురువారం ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో పర్యటించి మిరప పంట పంట నమోదును ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట నమోదు సెప్టెంబరు 15 వరకు మాత్రమే సమయం ఉందన్నారు. పంట నమోదు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సరళ ఉన్నారు.

టమోట పంటను తొలగించొద్దు

ప్యాపిలి, సెప్టెంబరు 5: అధిక వర్షాలతో తేమశాతం పెరిగి టమోట పంటకు తెగుళ్ల సోకడం సాధారణమని, పంటను తొలగించనవసరం లేదని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నాగరాజు, శాస్త్రవేత్త ఠాగూర్‌నాయక్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని ప్యాపిలి, పోతుదొడ్డి, పెద్దపూదిళ్ల గ్రామాల్లో టమోట పంటను వారు పరిశీలించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురిసినప్పుడు తేమశాతం ఎక్కువగా ఉండటం వలన ఆకుమచ్చ తెగుళ్ల సోకి కాయలు నల్లబడతాయన్నారు. ఉద్యానవన అధికారుల సూచనల ప్రకారం మందులు పిచికారి చేస్తే తెగుళ్ల అదుపులోకి వస్తాయన్నారు.

మేలైన దిగుబడికి పొలంబడి

డోన్(రూరల్), సెప్టెంబరు 5: మేలైన దిగుబడుల కోసం పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగుంట్ల గ్రామ పరిసరాల్లో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీతో కలిసి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులనుద్దేశించి ఏడీఏ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కంది అంతర్ పంటగా వేసిన కొర్రకు చీడ పురుగులు లేకపోవడంతో మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.

తగ్గని కప్పల వాగు ఉధృతి


ఎగ్గోని సమీపంలో ప్రవహిస్తున్న కప్పలవాగు

సంజామల, సెప్టెంబరు 5: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కప్పలవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోవెలకుంట్ల మండలం నుంచి ప్రవహించే కప్పలవాగులోకి పైతట్టు ప్రాంతం నుంచి భారీగా వరద నీరు రావడంతో ఉధృతి తగ్గడం లేదు. దీంతో వాగు పరివాహకంలో సాగైన మినుము, కంది, వరి పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు.

కుందూలో 14 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం

చాగలమర్రి, సెప్టెంబరు 5: చాగలమర్రిలో గురువారం తెల్లవారు జామున మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కుందూ, వక్కిలేరు వరద ఉధృతితో నీరు ప్రవహిస్తోంది. బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె గ్రామాల సమీపంలో వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద నీటిలోనే ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించారు. ఎలాంటి ప్రమాదం జరుగకుండా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పికెటింగ్ ఏర్పాటు చేశారు. రాజోలి ఆనకట్ట వద్ద 14 వేల క్యూసెక్కుల నీటితో కుందూ ఆనకట్టపై పొంగి ప్రవహించింది. వరద నీరు పెరగడంతో కేసీ కాలువకు నీటి ప్రవాహాన్ని తగ్గించామని ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆయా గ్రామ ప్రజలు, రైతులు, కూలీలు నది దాటే ప్రయత్నం చేయరాదని పేర్కొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 5: మండలంలోని వివిధ గ్రామా లలో శనివారం నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పోలీసు, విద్యుత్, రెవెన్యూ, పారిశుధ్యం శాఖలకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఆక్రమణల తొలగింపు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 5: ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని చిన్నకందుకూరు రహదారిలో ఆక్రమణకు గురైన కేసీ కాలువను కేసీ, తహసీల్దారు, మున్సిపాల్టి అధికారులు గురువారం తొలగించారు. తొలగింపులో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 5: మండల అభివృద్ధికి శాఖల వారిగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కొలిమిగుండ్ల ఎంపీడీవో ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో వచ్చే 5సంవత్సరాల అభివృద్ధి విజన్ ప్లాన్‌పై సమీక్షించారు. ఆయా శాఖల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, సమస్యలను గుర్తించి, ప్రణాళికలు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈఓఆర్‌డీ శ్రీహరి, ఏవో భూమా జ్యోతి, విద్యుత్ ఏఈ ప్రసన్న ఆంజనేయులు, ఏఎస్‌వో భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు


ఎమ్మెల్యే అఖిలప్రియకు నగదును అందజేస్తున్న టీడీపీ నాయకులు

శిరివెళ్ల, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులకు శిరివెళ్ల మండల టీడీపీ నాయకులు భారీ విరాళం అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు రూ.2,28,600 విరాళాన్ని విజయవాడ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి చేర్చాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు ఆళ్లగడ్డలో గురువారం అందజేశారు. మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి మురళి, బీసీ ఖాజా హుసేన్, ఫిదా హుసేన్, సిద్ధిఖ్, రాంపుల్లయ్య, శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

దొర్నిపాడు: వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధి కింద గురువారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు చాకరాజువేముల టీడీపీ నాయకులు రూ.43 వేలు విరాళం అందజేశారు. చాకరాజువేముల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు లింగుట్ల వెంకట్‌నాయుడు, పుల్లయ్య నాయుడు, ఎందూరి గోపాల్‌నాయుడు, బరిగెల నరసింహుడు, క్రిష్ణగుర్రప్ప యాదవ్, నారాయణస్వామి, దొర్నిపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు సిద్ధి సత్యం, శ్రీనివాసులు తమ వంతుగా వరద బాధితుల సహాయం కోసం విరాళం అందజేశారు.

చాగలమర్రి: విజయవాడ వరద బాధితుల కోసం తమ వంతు సహాయంతో సీఎం సహాయ నిధికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో చాగలమర్రి మండల కన్వీనర్ నరసింహారెడ్డి, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు కలిసి రూ.1.60 లక్షలు విరాళంగా అందజేశారు. మల్లేవేముల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రూ.60 వేలు, రాంపల్లి, తోడెండ్లపల్లె, పెద్దవంగలి, చింతలచెరువు, నేలంపాడు, చక్రవర్తులపల్లె, చిన్నవంగలి గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కలిసి రూ.లక్ష విరాళం ఎమ్మెల్యేకు అందజేశారు.

ఆళ్లగడ్డ: వరద బాధితులకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ గురువారం ఆర్థిక సాయం అందించారు. రుద్రవరం టీడీపీ మండల నాయకులు రూ1.80 లక్షలు, ఉయ్యాలవాడ టీడీపీ మండల నాయకులు రూ.లక్ష, నియోజకరవర్గంలోని విద్యా సంస్థలు రూ.లక్ష, వ్యాపారులు రూ.2 లక్షలు, రైతులు ఇచ్చిన బియ్యం, కందిబేడలను సీఎం సహాయ నిధికి అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

చాగలమర్రి, సెప్టెంబరు 5: మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలో నల్లాలమ్మ గుడి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 11 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, పోలీసులు కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దవంగలి వైపు నుంచి వస్తున్న ఆటో పారిపోవడానికి ప్రయత్నించగా ఆటోను పట్టుకున్నామని చెప్పారు. అందులో 11 బస్తాల రేషన్ బియ్యం ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. దువ్వూరు మండలం కృష్ణంపల్లె గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రవిని అదుపులోకి తీసుకొని విచారణ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, సెప్టెంబరు 5: మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన బోయ మనోహర్ (30) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గురువారం పోలీసులు తెలిపారు. రుద్రవరం గ్రామానికి చెందిన మనోహర్ ఆటోలో వెల్దుర్తి నుంచి రుద్రవరం వస్తూ ఎంబాయి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మనోహర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి తెలిపారు. మృతుని తమ్ముడు నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

చాగలమర్రి, సెప్టెంబరు 5: చాగలమర్రి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ముందస్తుగా చిన్నారులకు వినాయక వేషధారణలతో అలకరించారు. అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని దక్షిణకొట్టాల గ్రామంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పౌష్టికాహారంపై కార్యకర్త రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలి: సీపీఐ

బనగానపల్లె, సెప్టెంబరు 5: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రంగనాయుడు మాట్లాడుతూ యూరియా, డీఏపీతోపాటు పలు భూమి మందులు అధిక ధరలకు విక్రయిస్తూ రైతులపై భారం మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, శివయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

'విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి'

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 5: రెండు అడుగుల పైబడిన ప్రతి విగ్రహాల ఏర్పాటుకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ తప్పనిసరిగా ఉండాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కమిటీ సభ్యులతో, ఆయాశాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు.

'డిపాజిట్ తప్పనిసరి': వినాయక విగ్రహాల మండపాల వద్ద ఏర్పాటు చేసే విద్యుద్దీపాలకు ముందుగానే డిపాజిట్ చెల్లించాలని విద్యుత్ ఏఈ గురప్ప సూచించారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఆలయ ధర్మకర్త విశ్వనాథరెడ్డి, ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 5: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో ఈవోఆర్‌డీ రాధికారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, రేవనూరు ఏఎస్ఐ బాబు, విద్యుత్ ఏఈ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన: వినాయకచవితి నిమజ్జన ఏర్పాట్లను కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి గురువారం పరిశీలించారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం పక్కనే ఉన్న కుందూ నది వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లను నిర్వహిస్తుండగా వాటిని ఎస్ఐ పరిశీలించారు.

శిరివెళ్ల: గణేశ్ ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ చిన్న పీరయ్య సూచించారు. శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో మండల ప్రజలతో గురువారం ఆయన శాంతి సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్ప నిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాలకు విద్యుత్ సౌకర్యం, విగ్రహాల వద్ద భద్రత తదితర వాటిని నిర్వాహకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

రుద్రవరం: మండలంలో వినాయకచవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ వర ప్రసాద్ సూచించారు. గురువారం సాయంత్రం పోలీసుస్టేషన్ ఆవరణంలో విఘ్నేశ్వరుడి విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అందించాలి

బనగానపల్లె, సెప్టెంబరు 5: అంగన్‌వాడీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఏసురత్నం కోరారు. గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల సమావేశాన్ని నిర్వహిం చారు.

మద్యం స్వాధీనం

రుద్రవరం, సెప్టెంబరు 5: మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో మద్యం సీసాలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఐజయ్య అనే వ్యక్తి వద్ద గురువారం 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

చాగలమర్రి, సెప్టెంబరు 5: మండలంలోని చింతలచెరువు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆళ్లగడ్డ సబ్ యూనిట్ ఆప్తాలమిక్ వైద్యులు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. 138 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. ఇద్దరు బాలికలకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి వారికి జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని వైద్యులు చెప్పారు. నేత్రదానం పక్షోత్సవాల్లో భాగంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన ర్యాలీ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం సికిందర్‌బాషా, పీడీ శ్రీనాథ్‌రెడ్డి, సీహెచ్‌వో చంద్రకళ, మహిళా పోలీసు స్వాతి పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 5: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో వసం తోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు పెద్ద వీరయ్య, రామచంద్రుడు, చౌడయ్య, పురుషోత్తం, కంబగిరి రాముడు ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహిం చారు. కార్యక్రమంలో నంద్యాల నాగేశ్వరరెడ్డి, విజయ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం: కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రసన్న ఆంజనేయులు గురువారం తెలిపారు.

వరద బాధితులను ఆదుకుందాం: టీడీపీ


ప్యాపిలిలో విరాళాలు సేకరిస్తున్న టీడీపీ నాయకులు

ప్యాపిలి, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులను ఆదుకోనేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందజే యాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో వరద బాధితుల సహాయార్థం టీడీపీ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. అనంతరం నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ వరదలతో సర్వం కోల్పోయిన ప్రజలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, టి శ్రీనివాసులు, గండికోట రామసు బ్బయ్య, ఖాజాపీర్, రామ్‌కుమార్, లింగన్న, మధుకుమార్, అంకిరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'



భూమానగర్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, హెచ్‌ఈ వెంకటమ్మ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, సెప్టెంబరు 5: సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. గురువారం వ్యాధుల ముట్టడి అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన వైద్యులు మండల కేంద్రంలోని భూమానగర్ 1వ వార్డులో గురువారం వైద్యులు అంజలి ఆధ్వర్యంలో విష జ్వరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్లేవేముల, మద్దూరు, పెద్దబోదనం, నేలంపాడు గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 264 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 15 మంది జ్వర పీడితులను గుర్తించి వారికి రక్తపూత పరీక్షలు చేశారు. మలేరియా, డెంగీ వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు చేశారు. విష జ్వరాలపై కరపత్రాల ద్వార ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ముత్యాలపాడు వైద్యులు తస్లీమ్ సుల్తాన ఆధ్వర్యంలో శెట్టివీడు, కేపీ తండా, ముత్యాలపాడు, గొడిగనూరు, ఎం.తాండ గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి 134 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

డోన్, సెప్టెంబరు 5: పట్టణంలోని నంద్యాల-కర్నూలు రైల్వే గేట్ల మధ్యలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్ అన్నారు. గురువారం గుంతకల్లులోని డీఆర్‌ఎం కార్యాల యంలో డివిజనల్ రైల్వే మేనేజర్‌ను కలిసి వైసీపీ కౌన్సిలర్లు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జాకీర్ హుసేన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు రైల్వే అండర్ బ్రిడ్జిని మంజూరు చేయించారని తెలిపారు. టెండరు ప్రక్రియ పూర్తి చేసి బ్రిక్స్ నిర్మాణం కూడా పూర్తి చేశారని తెలిపారు. తరుచూ గేట్లు పడుతుండటంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, నాగేంద్ర, వెంక ట్రాముడు, కటిక వేణు, మిట్టా ఉమామహేశ్వరి, చలం వెంకటేశ్వరమ్మ, మౌలాబి, కళావతి పాల్గొన్నారు.

'వాటర్ ట్యాంకుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు'

రుద్రవరం, సెప్టెంబరు 5: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో వాటర్ ట్యాంకుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని ఎంపీడీవో మధుసూదనరెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ సూచించారు. గురువారం పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు వాటర్‌ట్యాంకులను క్లోరినేషన్ చేయించి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పైపులైను లీకేజీలు, కుళాయిల వద్ద లీకేజీలు వెంటనే మరమ్మత్తులు చేయించాలన్నారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిన ఆశా వర్కర్లు

బేతంచెర్ల, సెప్టెంబరు 5: బేతంచెర్ల మండలంలోని రంగాపురం పీహెచ్‌సీలో పని చేస్తున్న ఆశా వర్కర్లు సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలో చేరారని జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సుంకయ్య, మండల కార్యదర్శి తిరుమలేష్, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఏఐటీయూసీ తెలిపారు. ఆశా వర్కర్లు మండల కార్యదర్శి వెంకటలక్ష్మీ, మాజీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మహాలక్ష్మి తదితరులు ఏఐటీయూసీలో చేరారని అన్నారు.